## క్లుప్తంగా

### 12న మండల సర్వసభ్య సమావేశం

**చేజర్ల:** చేజర్ల మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఈ నెల 12వ తేదీన నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ విజయలలిత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో మధ్యాహ్నం 3 గంటలకు ఎంపీపీ తూమాటి విజయభాస్కర్‌రెడ్డి అధ్యక్షతన ఈ సమావేశాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

### విరువూరులో ఫ్యామిలీ డాక్టర్ వైద్యసేవలు



రోగులకు సూచనలిస్తున్న డాక్టర్ ఆయేషా

**వరికుంటపాడు:** మండలంలోని విరువూరు గ్రామంలో మంగళవారం 104 వాహనం ద్వారా వైద్యాధికారిణి ఆయేషా సిబ్బందితో కలిసి ఫ్యామిలీ డాక్టర్ వైద్యసేవలు అందించారు. ఈ సందర్భంగా 34 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఫ్యామిలీ డాక్టర్ వైద్యసేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో 104 వాహన సిబ్బంది పాల్గొన్నారు.

### ఆర్యవైశ్య సంఘం మండల కార్యవర్గం ఎంపిక



**అల్లూరు:** ఆర్యవైశ్యుల సంఘం అల్లూరు మండల కార్యవర్గాన్ని స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో మంగళవారం ఎంపిక చేశారు. ఆ సంఘం గౌరవాధ్యక్షుడిగా డి.బ్రహ్మానందం, అధ్యక్షుడిగా మొగళ్లపల్లి నాగేశ్వరరావు, సెక్రటరీగా వై.సురేంద్రబాబు, కోశాధికారిగా పి.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులుగా కె.బ్రహ్మానందం, గోళ్ల బాలాజీ, జె.వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శులుగా ఎం.సత్యనారాయణ, ఎం.ప్రసాద్, కృష్ణమూర్తి, సహాయ కోశాధికారులుగా ఎం.సురేష్, పి.శేఖర్, హరీష్, మహిళా కమిటీ అధ్యక్షురాలిగా చక్కా జ్యోతి, కార్యదర్శిగా మద్దాలి సీతాకల్యాణి, ట్రెజరర్‌గా పొత్తూరు సుకన్యను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు.

### పశుగ్రాస వారోత్సవాలు



**సంగం:** స్థానిక పశు వైద్యశాలలో పశువైద్యాధికారి సురేష్‌బాబు ఆధ్వర్యంలో మంగళవారం పశుగ్రాస వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన పశుసంవర్ధకశాఖ ఏడీ జయచంద్ర మాట్లాడుతూ పశుగ్రాసంలో రకాలు, వాటి సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. పశుగ్రాసం ప్రాముఖ్యతను వివరించారు. పశుగ్రాసంతో పాల ఉత్పత్తి పెంచుకుని రైతు ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చన్నారు. కార్యక్రమంలో జలాల్‌బాషా, రాజేష్, రమ్య, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

### మట్టి ట్రాక్టర్ల పట్టివేత

**మర్రిపాడు:** మండలంలోని కదిరినేనిపల్లి చెరువు నుంచి మంగళవారం ఇటుక బట్టీల కోసం అక్రమంగా మట్టి తరలిస్తున్న 2 ట్రాక్టర్లను తహసీల్దార్ సీతారత్నం స్వాధీనం చేసుకున్నారు. ఇటుక బట్టీల నిర్వాహకులు చెరువు నుంచి మట్టిని అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారంతో తమ సిబ్బందితో ఘటనా స్థలాన్ని పరిశీలించేందుకు వెళ్లారని తెలిపారు. అక్రమంగా మట్టిని తరలిస్తున్న 2 ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. బుధవారం మైనింగ్ శాఖకు ట్రాక్టర్లను అప్పగించనున్నామని, ఎవరైనా అక్రమంగా మట్టిని తరలిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆమె వెంట ఆర్‌ఐ సురేంద్ర, వీఆర్‌ఓ రాజశేఖర్ ఉన్నారు.

### పిచ్చికుక్క స్వైరవిహారం

**ఉదయగిరి:** పట్టణంలో మంగళవారం ఓ పిచ్చికుక్క స్వైరవిహారం చేసి పలువురిని గాయపరిచినట్లు స్థానికులు తెలిపారు. పట్టణంలోని సినిమా హాలు వీధి, యూనియన్ రోడ్డు, పోలీస్‌స్టేషన్ సమీపంలో చిన్నారులు, మహిళలు, వృద్ధులపై పిచ్చికుక్క దాడి చేసి గాయపరిచింది. ప్రధానంగా పోలీస్‌స్టేషన్ సమీపంలోని చికెన్ దుకాణాల వద్ద కుక్కలు గుంపులు చేసి వాహనదారులపై దాడి చేసి గాయపరుస్తున్నాయి. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని పట్టణవాసులు కోరుతున్నారు.

# రైతులకు నాణ్యమైన ఎరువులు అందించాలి

• ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు



ఆత్మకూరురూరల్: ఎరువుల దుకాణంలో స్టాకును పరిశీలిస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

**ఆత్మకూరురూరల్:** రైతులకు నాణ్యమైన ఎరువులు, పురుగు మందులు అందించాలని వ్యవసాయ శాఖ, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సూచించారు. ఆత్మకూరు పట్టణంలోని పలు ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మంగళవారం తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ప్రకాశం జిల్లా కనిగిరి ఏడీఏ ఈవీ రమణ, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ వి.సుధాకర్‌రెడ్డి 145.5 లీటర్ల పురుగుమందుల ద్రావణం, 97.5 కిలోల పురుగుమందుల స్టాకును గుర్తించి విక్రయించకుండా నిలుపుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతి దుకాణంలోనూ స్టాక్ రిజిస్టర్, బిల్లు పుస్తకాలు తదితర రికార్డులను ఎప్పటికప్పుడు సరిచేసుకోవాలని దుకాణాదారులను ఆదేశించారు. రైతులు ఎరువులు, పురుగుమందులు కొనుగోలు చేసినప్పుడు వారికి తప్పనిసరిగా బిల్లులు అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీఏలు నర్సోజీరావు, దేవసేనమ్మ, ఏఓ కె.కిషోర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

**ఏఎస్‌పేట మండలంలో..**

**అనుమసముద్రంపేట:** ఏఎస్‌పేట మండలంలోని హసనాపురంలో ఎరువులు, పురుగుమందుల దుకాణాలలో వ్యవసాయశాఖ, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మంగళవారం తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా దుకాణాల్లోని స్టాక్, రిజిస్టర్లు పరిశీలించారు. రైతులకు నాణ్యమైన ఎరువులు, పురుగు మందులు అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీఏలు రమణరావు, నర్సోజీరావు, దేవసేనమ్మ, ఏఓ టి.రజని పాల్గొన్నారు.

**ఆదూరుపల్లిలో..**

**చేజర్ల:** మండలంలోని ఆదూరుపల్లిలో ఎరువులు, పురుగుమందుల దుకాణాలను విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మంగళవారం తనిఖీ చేశారు. దుకాణాల్లోని ఎరువులు, పురుగుమందుల నిల్వలు, బిల్‌బుక్, ఇతర రిజిస్టర్లు పరిశీలించారు. కార్యక్రమంలో ఏడీఏలు రమణ, నర్సోజీరావు, శివనాయక్, విజిలెన్స్ సీఐ సుధాకర్‌రెడ్డి, ఏఓ శశిధర్, ఏఈఓ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



అనుమసముద్రంపేట: తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు



చేజర్ల: ఆదూరుపల్లిలో..

# తల్లీ బిడ్డ ఆరోగ్యాన్ని సంరక్షించండి



సీతారామపురం: గర్భిణిని పరీక్షిస్తున్న వైద్యురాలు స్వప్నారెడ్డి



కావలి: వెంగళరావునగర్ పీహెచ్‌సీలో..

**కావలి:** డాక్టర్ రామ్ సెంటర్, జవహర్ భారతి విశ్వోదయ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి మాతృత్వ సురక్ష యోజన పథకం ద్వారా కావలి పట్టణంలోని వెంగళరావునగర్ పీహెచ్‌సీలో మంగళవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యురాలు రమ్య మాట్లాడుతూ గర్భిణులు క్రమం తప్పకుండా వైద్యపరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అనంతరం గర్భిణులకు మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ రామ్ సెంటర్ చైర్మన్ దొడ్ల మనోహరరెడ్డి, డైరెక్టర్ కూనం తాతిరెడ్డి, సామాజిక కార్యకర్త ఎం.మాలకొండారెడ్డి, సీఓ ప్రసాద్, సూపర్‌వైజర్ సుగుణమ్మ, సబ్ యూనిట్ ఆఫీసర్ వెంకటరెడ్డి, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

**గర్భిణులకు వైద్యపరీక్షలు**

**సీతారామపురం:** మండలంలోని పలు గ్రామాలకు చెందిన 41 మంది గర్భిణులకు మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారిణి స్వప్నారెడ్డి వైద్యపరీక్షలు నిర్వహించారు. ప్రధాన మంత్రి మాతృత్వ సురక్ష అభియాన్ పథకంలో భాగంగా పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

**గర్భిణులకు ఉచిత వైద్యపరీక్షలు**

**వరికుంటపాడు:** మండలంలోని గర్భిణులు ప్రభుత్వ వైద్యశాలల్లోనే కాన్పులను చేయించుకోవాలని, ఉచితంగా చేస్తున్న వైద్యపరీక్షలను సద్వినియోగం చేసుకోవాలని మండల వైద్యాధికారిణి కరిష్మా సూచించారు. ఆమె మంగళవారం స్థానిక పీహెచ్‌సీలో ప్రధానమంత్రి మాతృత్వ సురక్ష యోజన పథకం ద్వారా 14 మంది గర్భిణులకు ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించారు. గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆమె అవగాహన కల్పించారు. రక్తహీనతకు గురికాకుండా పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవాలని, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ రాజశేఖరరాజు, పీహెచ్‌ఎన్ సుశీలమ్మ, స్టాఫ్‌నర్స్ రోజారమణి తదితరులు పాల్గొన్నారు.



గర్భిణుకు సూచనలిస్తున్న వైద్యురాలు కరిష్మా

# మెనూ ప్రకారం భోజనం అందించాలి

**సీతారామపురం:** విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని ఎంఈఓ షేక్ మస్తాన్‌వలి సూచించారు. ఆయన మంగళవారం స్థానిక ఆదర్శ పాఠశాలను తనిఖీ చేసి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. తాజా కూరగాయలతో పరిశుభ్రమైన వాతావరణంలో వంట వండి నాణ్యతా ప్రమాణాలతో కూడిన రుచికరమైన ఆహారం విద్యార్థులకు అందేలా ఉపాధ్యాయులు చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనాన్ని రుచి చూశారు. ఆయన వెంట మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ రెహమాన్, ఉపాధ్యాయులు ఉన్నారు.



మధ్యాహ్న భోజనాన్ని రుచి చూస్తున్న ఎంఈఓ మస్తాన్‌వలి

## విద్యార్థులకు నోటుపుస్తకాలు, నగదు ప్రోత్సాహకాలు

**మర్రిపాడు:** మండలంలోని కదిరినాయుడుపల్లి కాంప్లెక్స్ పరిధిలో ఉన్న 10 పాఠశాలల్లో చదివే విద్యార్థులకు గంగిరామ చారిటబుల్ ట్రస్ వ్యవస్థాపకులు, ప్రవాస భారతీయులు గంగిరెడ్డి ఓబుల్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, కేశవరెడ్డిల దాతృత్వంతో ట్రస్ట్ చైర్మన్ బంకా శ్రీధర్ చేతులమీదుగా కదిరినాయుడుపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం నోటుపుస్తకాలను పంపిణీ చేశారు. అలాగే కదిరినాయుడుపల్లి ఉన్నత పాఠశాలలో 2023–24 సంవత్సరంలో 10వ తరగతి ఫలితాల్లో మొదటి, రెండు, మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులు సుస్వంత్, సుధ, గోవర్ధన్‌లకు వరుసగా రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేల చొప్పున నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులంతా బాగా చదివి ఉన్నతంగా ఎదగాలనే లక్ష్యంతో వారికి సహాయ సహకారాలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కదిరినాయుడుపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవి, ఉపాధ్యాయులు ఆర్.శ్రీనివాసులు, ఎ.శ్రీనివాసులు, వెంకటరమణ, సుబ్బారెడ్డి, శివయ్య, విజయారెడ్డి, రత్నయ్య, విజయభాస్కర్‌రెడ్డి, వెంకటరెడ్డి, సుబ్బయ్య, వెంగయ్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



నగదు ప్రోత్సాహకాలు అందజేస్తున్న దృశ్యం

## ఆత్మకూరు-బెంగళూరు ఆర్టీసీ సర్వీసు ప్రారంభం

**ఆత్మకూరురూరల్:** ఆత్మకూరు ఆర్టీసీ డిపో నుంచి ప్రతి రోజూ సాయంత్రం 7 గంటలకు బెంగళూరుకు బస్సు బయలుదేరేలా నూతన సర్వీసును సోమవారం ప్రారంభించినట్లు ఆర్టీసీ అధికారులు మంగళవారం తెలిపారు. ఆత్మకూరు నుంచి మర్రిపాడు మీదుగా వెళ్లే ఈ బస్సు టిక్కెట్ ధర రూ.720గా నిర్ణయించినట్లు డిపో అసిస్టెంట్ మేనేజర్ కల్పన తెలిపారు. ఇప్పటికే ఆత్మకూరు నుంచి రాత్రి 8, 9 గంటలకు బెంగళూరు వెళ్లేందుకు సూపర్‌లగ్జరీ బస్సు నడుపుతున్నామని ఆత్మకూరు నుంచి అనంతసాగరం మీదుగా బద్వేల్ వైపు బెంగళూరుకు వెళ్లేందుకు మరో బస్సును ప్రయాణికులకు అందుబాటులో ఉంచామని తెలిపారు. ప్రతి రోజూ అదనంగా 4వ బస్సును కూడా అందుబాటులో ఉంచామని, ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.





# సీజనల్ వ్యాధులపై అవగాహన

**ఉదయగిరి:** పట్టణంలోని కరీమావీధిలో వైద్య ఆరోగ్య సిబ్బంది మంగళవారం మండల వైద్యాధికారిణి ఎం.శివకల్పన ఆదేశాల మేరకు సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బంది ఇంటింటికీ వెళ్లి జ్వరాలు, లార్వా సర్వే నిర్వహించారు. ఈ సర్వేలను ఆరోగ్య బోధకుడు కె.వెంకటసుబ్బయ్య, మలేరియా సబ్‌యూనిట్ అధికారి నౌషాద్‌బాబు పరిశీలించి సిబ్బందికి సూచనలందించారు. అనంతరం వారు డెంగీ, డయేరియా వ్యాధులు వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ నెల 11న నిర్వహించనున్న ప్రపంచ జనాభా దినోత్సవంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ చెన్నయ్య, ఎంఎల్‌హెచ్‌పీ నాగార్జున, సిబ్బంది కె.శ్రీనివాసులు, జి.శ్రీనివాసులు, రబ్బానీ, స్వాతి, జయమ్మ, నూర్జహాన్ తదితరులు పాల్గొన్నారు.



సర్వే చేస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది

# బీటీఏ సభ్యత్వ నమోదు

**ఆత్మకూరు:** బహుజన టీచర్స్ అసోసియేషన్ సభ్యత్వ నమోదు కార్యక్రమం మంగళవారం ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించారు. కార్యక్రమంలో బీటీఏ రాష్ట్ర కోశాధికారి ఆదినారాయణ, జిల్లా అధ్యక్షుడు మణిసుబ్బయ్య, ఎం.ప్రసాద్, వి.రఘు, జె.కొండయ్య, ఎం.ప్రసాద్, బాలయ్య, స్నేహకుమార్ తదితరులు పాల్గొన్నారు.

**ఆత్మకూరురూరల్:** మండలంలోని కరటంపాడు, మహిమలూరు, పేరారెడ్డిపల్లి జెడ్పీ హైస్కూల్ తదితర ప్రభుత్వ పాఠశాలల్లో మంగళవారం బీటీఏ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పల్లం వేణుగోపాల్, కోశాధికారి ఆదినారాయణ, జిల్లా అధ్యక్షుడు మణి సుబ్బు, ప్రధాన కార్యదర్శి ప్రసాద్, వెంకటేశ్వర్లు, రఘు, సుధాకర్, కొండయ్య, ప్రసాద్, బాలయ్య, స్నేహకుమార్ తదితరులు పాల్గొన్నారు.

### పాఠశాలకు ఫర్నిచర్ వితరణ



**ఆత్మకూరురూరల్:** మండలంలోని మురగళ్ల ప్రాథమిక పాఠశాలకు పూర్వ విద్యార్థి తోడేటి పెంచలప్రసాద్ మంగళవారం ఫర్నిచర్ వితరణగా అందించారు. తన తండ్రి తోడేటి నాగయ్య జ్ఞాపకార్థం పాఠశాలకు బీరువా, టేబుల్ తదితరాలు సమకూర్చినట్లు పెంచలప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో అన్నపూర్ణ, వెంకటరమణ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

### నేడు డయల్ యువర్ డీఎం

**ఆత్మకూరురూరల్:** ఆత్మకూరు ఆర్టీసీ డిపోలో బుధవారం డయల్ యువర్ ఆర్టీసీ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ కరీమున్నీసా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి 12 గంటల వరకు నిర్వహించే ఈ కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు పాల్గొంటారని తెలిపారు. ఆత్మకూరు ప్రాంత ప్రయాణికులు, ప్రజలు 9959225645 మొబైల్ నంబర్‌కు ఫోన్ చేసి తమ సూచనలు, సలహాలు అందించవచ్చని తెలిపారు.

**ఉదయగిరి డిపో పరిధిలో..**

**ఉదయగిరి:** ఉదయగిరి ఆర్టీసీ డిపో పరిధిలోని ప్రయాణికుల కోసం బుధవారం ఉదయం 11 గంటలకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ డీఎం ఎం.శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిపో పరిధిలో బస్సు సర్వీసులు, లాజిస్టిక్స్ సేవలపై ప్రయాణికులు, ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించవచ్చని తెలిపారు. ఆర్టీసీ అందించే సేవల్లో ప్రయాణికులకు ఏవైనా ఇబ్బందులు, సమస్యలు ఉంటే 9959225095 మొబైల్ నంబర్‌కు ఫోన్ చేసి తెలుపవచ్చన్నారు.

### రేబిస్ నిరోధక టీకాలు వేయించాలి

**వరికుంటపాడు:** మండలంలోని పెంపుడు కుక్కలకు వాటి యజమానులు రేబిస్ నిరోధక టీకాలు వేయించాలని ఇన్‌చార్జ్ పశువైద్యాధికారి ఎస్వీ రాఘవేంద్రశర్మ సూచించారు. ఆయన మంగళవారం వరికుంటపాడు మండలంలోని పెద్దిరెడ్డిపల్లి, వరికుంటపాడు పశు వైద్యశాలల పరిధిలో సుమారు 10 కుక్కలకు టీకాలు వేశారు. పశు వైద్యశాలల్లో వేస్తున్న రేబిస్ నిరోధక టీకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

### పనులు త్వరగా పూర్తిచేయండి

**ఉదయగిరి:** మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో జరుగుతున్న స్కూల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇంప్లిమెంట్ పనులు త్వరగా పూర్తిచేయాలని ఎంఈఓ-2 తోట శ్రీనివాసులు సూచించారు. ఆయన మంగళవారం మండలంలోని కృష్ణంపల్లి ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్లాబు, కాంక్రీటు పనులకు, ప్లాస్టరింగ్ పనులకు ప్రతి రోజూ వాటర్ క్యూరింగ్ చేయాలని సూచించారు. ఆయన వెంట ప్రధానోపాధ్యాయుడు శివరామిరెడ్డి, ఉపాధ్యాయుడు రమేష్ ఉన్నారు.

# తెలుగు తమ్ముళ్ల మధ్య విభేదాలు

**సీతారామపురం:** ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి చిత్రపటాలను మండల కార్యాలయానికి బహూకరించే ప్రక్రియలో భాగంగా తెలుగు తమ్ముళ్ల మధ్య విభేదాలు భగ్గుమన్నాయి. టీడీపీ మండల సీనియర్ నాయకులకు సమాచారం ఇవ్వకుండానే కన్వీనర్ కప్పా ప్రభాకర్‌రాజు వ్యవహరించిన తీరును పలువురు సీనియర్ నాయకులు తప్పుబట్టారు. తమకు ముందస్తు సమాచారం ఇవ్వకుండానే జనసేన నాయకులతో కలిసి చిత్రపటాలను ఎలా బహూకరించారని ప్రశ్నించారు. టీడీపీ కార్యాలయం ఎదుటే వారి మధ్య కొద్దిసేపు వాగ్వాదం జరిగింది. కన్వీనర్ ఏకపక్ష తీరుతో పలువురు సీనియర్ నాయకులు గుర్రుగా ఉన్నట్లు సమాచారం. అలాగే జనసేనలో కూడా వర్గవిభేదాలు భగ్గుమన్నాయి. ఒకవర్గం నాయకత్వాన్ని మరో వర్గం వ్యతిరేకిస్తుండడంతో కూటమి నాయకుల మధ్య విభేదాలు తారస్థాయికి చేరుకున్నాయనడంలో అతిశయోక్తి లేదు.

# ఘనంగా ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం



ఆత్మకూరు: సోమశిల రోడ్డు సెంటర్ వద్ద ఏబీవీపీ జెండా ఆవిష్కరిస్తున్న విద్యార్థులు

**ఆత్మకూరు:** అఖిల భారత విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) 75 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా మంగళవారం ఆత్మకూరు పట్టణంలో వేడుకలు నిర్వహించారు. హనుమాన్ జంక్షన్ నుంచి సోమశిల రోడ్ సెంటర్ వరకు ఏబీవీపీ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం సోమశిల రోడ్ సెంటర్‌లో ఏబీవీపీ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏబీవీపీ నగర అధ్యక్షుడు దారా వెంకటేశ్వర్లు, మధు, భరణి, రామ్‌చరణ్, జగదీష్, మాలేష్ తదితరులు పాల్గొన్నారు.

**కావలిలో ర్యాలీ**

**కావలి:** అఖిల భారత విద్యార్థి పరిషత్ ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం కావలి పట్టణంలో విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. ర్యాలీ నిర్వహించి స్థానిక ట్రంక్‌రోడ్డులోని ఛత్రపతి శివాజీ విగ్రహం వద్ద జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డి.మనువర్ధన్, ఎస్.వినయ్, ఎస్.త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

**సంగంలో..**

**సంగం:** ఏబీవీపీ సంగం మండల అధ్యక్షుడు అవినాష్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం సంగంలో ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఏబీవీపీ నాయకులు పాల్గొన్నారు.

# వారోత్సవాల ముగింపు

**ఆత్మకూరు:** గత వారం రోజులుగా ఆత్మకూరులో నిర్వహిస్తున్న ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ యూనియన్ వారోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సీనియర్ బ్రాంచ్ మేనేజర్ ఎం.మెహర్‌కుమార్, ఏబీఎం శివకుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో శివప్రసాద్, డేవిడ్‌రాజు, హరికృష్ణ, సాధిక్ హుస్సేన్, గంగాధర్, వాగాల శ్రీహరి, గంటా లక్ష్మీపతి, ఎస్.ప్రవీణ్, శ్యామ్ ప్రభాకర్, టి.రమేష్, ఎం.రమాదేవి, సాయితేజ, పి.శీనయ్య తదితరులు పాల్గొన్నారు.

# మొహర్రం సాయం

**ఆత్మకూరు:** త్వరలో జరగనున్న మొహర్రం వేడుకలను ఘనంగా నిర్వహించుకోవాలని సూచిస్తూ వైఎస్సార్‌సీపీ నాయకుడు డాక్టర్ జె.ప్రణీత్ రూ.10 వేలు ఆర్థికసాయం అందజేశారు. ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని ఎల్‌ఆర్‌పల్లి పీర్లచావడి వద్ద ఈ వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందుకోసం డాక్టర్ వింజం దొరసానమ్మ మెమోరియల్ ట్రస్ట్ తరఫున డాక్టర్ ప్రణీత్ మంగళవారం ఆత్మకూరులో రూ.10 వేల చెక్కును వారికి అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ సందీప్, డాక్టర్ కుమార్, అశోక్ ఉన్నారు.



# పారిశుద్ధ్య పనులు చేపట్టండి

**అనుమసముద్రంపేట:** మండల కేంద్రం ఏఎస్‌పేటలో జరుగుతున్న కాలువ పనులు, పారిశుద్ధ్య పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ తిరుమలకుమార్ సూచించారు. మంగళవారం ఏఎస్‌పేటలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను ఆయన పరిశీలించారు. ఆయన వెంట డీఈ వెంకటేశ్వర్లు, కల్లూరు ప్రభాకర్‌రెడ్డి, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.